## క్లుప్తంగా

### ఓపీఓల ఎన్నికల శిక్షణ వాయిదా

కోదాడ/ కోదాడఅర్బన్ : పట్టణ పరిధిలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఓపీ ఓలకు జరగాల్సిన ఎన్నికల శిక్షణ వాయిదా పడిందని, మళ్లీ ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామని కోదాడ మండల విద్యాధికారి సలీం షరీఫ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల విధులలో పాల్గొనే ఉపాధ్యాయులు, ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

### 10న మల్లు లక్ష్మి నామినేషన్

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ అసెంబ్లీ స్థానానికి సీపీఎం ఎమ్మెల్యే అభ్యర్థిగా మల్లు లక్ష్మి ఈనెల 10న నామినేషన్ వేయనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి తెలిపారు. మంగళవారం హుజూర్‌నగర్ పట్టణంలోని ఆపార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం పోరాటం చేస్తుందన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు పి. శేఖర్‌రావు, ఎస్. పాండు, పల్లె వెంకట్‌రెడ్డి, డి. బ్రహ్మం, ప్రకాష్, యాకుబ్, నగేష్, పాండు, సైదులు, వెంకన్న, హుస్సేన్, సుందర మాహేశ్వరరెడ్డి, బాలు, త్రివేణి పాల్గొన్నారు.

### 10న హుజూర్‌నగర్‌లో న్యాయవాదుల సమావేశం

హుజూర్‌నగర్ : పట్టణ పరిధిలోని మేళ్లచెరువు బైపాస్ రోడ్డులో గల ఓ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 10న హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదుల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రామిరెడ్డి, అధికార ప్రతినిధి కాల్వ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరి అభ్యర్థిత్వాన్ని బలపరచాలనే అంశంపై సమావేశంలో చర్చించనున్నట్లు వారు తెలిపారు. ఈ సమావేశానికి న్యాయవాదులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని వారు కోరారు.

### పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, ఆర్పీలకు నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రావులపల్లి ప్రసాద్ సౌజన్యంతో మంగళవారం చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీలో పారిశుద్ధ్య సేవలను గుర్తించిన ప్రసాద్ కార్మికులకు చీరలు పంపిణీ చేయడం అభినందనీయన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డీసీ బట్టు మధు, చార్టడ్ ప్రెసిడెంట్ సీతారాంరెడ్డి, క్రాంతికుమార్, రంగారెడ్డి, సత్యనారాయణ, యూసుఫ్, లక్ష్మీరెడ్డి, సైదులు తదితరులు ఉన్నారు.

### క్యాట్ ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ

హుజూర్‌నగర్ : నాలెడ్జ్ అసెస్‌మెంట్ టెస్ట్ (క్యాట్) ఒలింపియాడ్ లెవెల్ -1 పరీక్షలో శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ఆ స్కూల్ హెచ్ఎం పీవీ రమణారావు తెలిపారు. పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మంగళవారం పాఠశాలలో ధ్రువపత్రాలు అందజేసి మాట్లాడారు. పాఠశాల నుంచి 85 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగ 65 మంది సెకండ్ లెవెల్‌కు ఎంపికై నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఎస్టీయూ మండల నూతన కమిటీ ఎన్నిక



ఎం. వీరేంద్రవర్మ, అధ్యక్షుడు



వి.చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి

కోదాడఅర్బన్ : ఎస్టీయూ కోదాడ మండల నూతన కార్యవర్గాన్ని మంగళవారం కోదాడ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన ఆ సంఘం సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మైలారిశెట్టి వీరేంద్రవర్మ, ప్రధాన కార్యదర్శిగా వల్లూరి చంద్రశేఖర్, ఆర్థిక శాఖ కార్యదర్శులుగా బి.శ్రీనివాస్, ఎ.బాలులను, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా ఎస్.ఉపేందర్, బి.రామచంద్రారెడ్డి, టి.లోకేష్, ఎం.పాపారావు లను ఎన్నుకున్నారు. అదే విధంగా జిల్లా ఉపాధ్యక్షుడిగా టి భాస్కర్‌ను ఎన్నకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బంధం వెంకటేశ్వర్లు, ఓరుగంటి నాగేశ్వరరావు, బీవీ, హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

### అకాల వర్షంతో నేలకొరిగిన వరిపైరు

నడిగూడెం : మండలంలోని రామాపురం, చాకిరాల గ్రామాల్లో మంగళవారం అకాల వర్షం కురిసింది. దీంతో పలువురు రైతులకు చెందిన వరి పంట నేలకొరిగింది. అదేవిధంగా కల్లాల వద్ద ఉన్న వరి ధాన్యం తడిసింది. ఆరుగాలం కష్టపడి పంటను పండిస్తే అకాల వర్షం తమకు నష్టం కలుగజేసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

# కొనసాగుతున్న నామినేషన్లు

- కోదాడలో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి ఒకరు, ఇండిపెండెంట్‌గా ఇద్దరు నామినేషన్లు
- హుజూర్‌నగర్‌లో ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు



కోదాడ : ఆర్‌ఓకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ఇండిపెండెంట్ అభ్యర్థి బెల్లంకొండ నవీన్



హుజూర్‌నగర్ : నామినేషన్ పత్రాలు అందజేస్తున్న అంగిరెడ్డి కోటిరెడ్డి



హుజూర్‌నగర్ : నామినేషన్ పత్రాలు అందజేస్తున్న తండు ఉపేందర్



హుజూర్‌నగర్ : పత్రాలు అందజేస్తున్న జక్కుల శ్రీకాంత్

కోదాడ : కోదాడ అసెంబ్లీ స్థానానికి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు మంగళవారం ముగ్గురు తమ నామినేషన్లను దాఖలు చేశారు. ఇండిపెండెంట్ అభ్యర్థులుగా బెల్లంకొండ నవీన్, పిట్టల సైదులు, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరపున అబ్దుల్ మాలిక్‌లు తన నామినేషన్లను కోదాడ అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సూర్యానారాయణ ముందు దాఖలు చేశారు. దీంతో కోదాడ నియోజకవర్గంలో ఇప్పటివరకు దాఖలైన నామినేషన్ల సంఖ్య తొమ్మిదికి చేరింది.

**ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు..**

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఎమ్మెల్యే అభ్యర్థులుగా మంగళవారం ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. కోదాడకు చెందిన అంగిరెడ్డి కోటిరెడ్డి, హుజూర్‌నగర్‌కు చెందిన తండు ఉపేందర్, జక్కుల శ్రీకాంత్‌లు తమ నామినేషన్లను దాఖలు చేశారు. ముగ్గురు కూడా ఒక్కొక్కరే వచ్చి ఆర్‌ఓ జగదీశ్‌రెడ్డికి నామినేషన్ పత్రాలు అందజేశారు.

## 'సాక్షి' మ్యాథ్స్- బీకి విశేష స్పందన



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కోదాడరూరల్ : కోదాడ పట్టణ పరిధిలోని కొమరబండలో గల కేఎల్‌ఆర్ కాలనీలోని తేజ పాఠశాలలో ×సాక్షి×గ్రూప్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మ్యాథ్స్- బీ పరీక్షకు విశేష స్పందన లభించింది. 5 నుంచి 10వ తరగతి విద్యార్థులకు మూడు కేటగిరీల్లో ఈ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి మాట్లాడుతూ విద్యార్థుల్లో గణితంపై పట్టు సాధించడానికి, వారిని ప్రోత్సహించడాకి ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. ప్రతి సంవత్సరం 'సాక్షి'గ్రూప్ వారు ఈ పోటీలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. కాగా, గణిత ఉపాధ్యాయులు రేణుక, బ్రహ్మారెడ్డి ఈ పోటీలను పర్యావేక్షించారు.

### కోదాడ సీపీఎం అభ్యర్థిగా మట్టిపల్లి సైదులు



కోదాడ : కోదాడ అసెంబ్లీ సీపీఎం అభ్యర్థిగా మోతె మండలంలోని రాఘవాపురానికి చెందిన మట్టిపల్లి సైదులును ఆ పార్టీ ప్రకటించింది. సైదులు ప్రస్తుతం ఆ పార్టీ సూర్యాపేట జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడిగా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు.

**ప్రొఫైల్**

**కోదాడ :** మట్టిపల్లి సైదులు
**తల్లిదండ్రులు :** రామచంద్రయ్య, యల్లమ్మ
**పుట్టిన తేది :** 01-05-1985
**స్వస్థలం :** రాఘవాపురం, మోతె మండలం
**కుటుంబం :** భార్య నీలిమ, పిల్లలు మానస
**చదువు :** పదవ తరగతి

### అకాల వర్షానికి నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

నడిగూడెం : కోదాడ నియోజకవర్గంలో మంగళవారం కురిసిన అకాల వర్షానికి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు గుర్రం వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కల్లాల వద్ద ధాన్యం తడిసిందని, చేతికొచ్చే దశలో ఉన్న పొలాలు తడిసి రైతులు స్వల్పంగా నష్టపోయారన్నారు.

### అయ్యప్ప మాలధారులకు అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

మునగాల : మండల కేంద్రం శివారులోని శ్రీహరిహరసుత అయ్యప్ప దేవాలయం ఆవరణలోని అన్నదాన సత్రంలో అయ్యప్ప మాలధారులకు అన్నదాన కార్యక్రమాన్ని దేవాలయ కమిటీ సభ్యులు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ తడకమళ్ల శ్రీనివాసాచారి మాట్లాడుతూ డిసెంబర్ 17వరకు (41 రోజుల పాటు) అన్నదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ సలహాదారుడు నల్లపాటి శ్రీనివాస్, గోశాల చైర్మన్ వంగవేటి గురుమూర్తి, గురుస్వాములు వల్లోజు వెంకన్న, కుందూరు పుల్లారెడ్డి, తంగెళ్ల సాంబ, బొబ్బిలి సంజీవరెడ్డి, ఈదారావు, గ్రామపెద్దలు దేవినేని రవి, కాసర్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### బరాఖత్‌గూడెంలో కాంగ్రెస్‌కు టీడీపీ మద్దతు

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెంలో టీడీపీ గ్రామశాఖను ఈ ఎన్నికలలో తనకు మద్దతు ఇవ్వాలని కోదాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎన్.పద్మావతిరెడ్డి మంగళవారం రాత్రి కోరారు. దీంతో టీడీపీ గ్రామశాఖ నాయకత్వం అంగీకరించి మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు సమక్షంలో తమ మద్దతు తెలిపారు. ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పద్మావతిరెడ్డి విజయానికి తాము కృషిచేస్తామని హామీ ఇచ్చారు.

### ఎత్తిపోతల పథకం పరిశీలన



ఎత్తిపోతల పథకాన్ని పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రమణానాయక్, తదితరులు

మఠంపల్లి : మండలంలోని రామచంద్రాపురంతండా వద్ద కృష్ణానదిపై నిర్మించిన అమరవరం ఎత్తిపోతల పథకాన్ని మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్ రమణానాయక్ స్థానిక పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇరుగు పిచ్చయ్య, జెడ్పీటీసీ జగన్ నాయక్, మాజీ ఎంపీపీ కొండానాయక్, సర్పంచ్ మన్నెం శ్రీనివాసరెడ్డి, ఉపసర్పంచ్ జాల కిరణ్, నాయకులు నవీన్‌నాయక్, సుధాకర్‌రెడ్డి, బాలాజీ, భరత్, భాస్కర్‌రెడ్డి, పాపారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్‌లోకి పలువురు నాయీ బ్రాహ్మణులు



నాయీబ్రాహ్మణులను బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణంలోని నాయీ బ్రాహ్మణ సంఘం భవనంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆలేటి సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం నాయీ బ్రాహ్మణుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే, కోదాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనను నాయీ బ్రాహ్మణులు గజమాలతో సత్కరించారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన వంద కుటుంబాల నాయీబ్రాహ్మణులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. సమావేశంలో నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు శ్రీరాములు, నగేష్, శ్రీనివాస్, గోపి, శంకర్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా రామాపురం రోడ్డు



చిలుకూరు- రామాపురం రోడ్డులో మూలమలుపు వద్ద రోడ్డును కమ్మేసిన కంపచెట్లు



ఎన్‌ఎస్‌పీ కాలువ వద్ద గుంతలమయంగా రామాపురం రోడ్డు

- రోడ్డుపై గుంతలు, మూలమలుపుల వద్ద దారిని కమ్మేసిన కంపచెట్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

చిలుకూరు : మండల కేంద్రం నుంచి రామాపురం వెళ్లే రోడ్డు ప్రమాదకరంగా మారింది. రోడ్డు గుంతలమయం కావడంతో పాటు రోడ్డుకు ఇరుపక్కల కంపచెట్లు ఏపుగా పెరిగాయి. దీంతో ఆ రోడ్డులో ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా చిలుకూరు, రామాపురం గ్రామానికి చెందిన రైతుల పొలాలు చాలావరకు ఈ రోడ్డు వెంటనే ఉంటాయి. దీంతో ఈ రోడ్డు ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. అంతేగాక జాతీయ రహదారి హైదరాబాద్ - విజయవాడ రోడ్డుకు కూడా ఈ రోడ్డు నుంచి వెళ్తుంటారు. సుమారుగా 15 ఏళ్ల క్రితం కేంద్ర నిధులతో ఈ రోడ్డు నిర్మించారు. మొదట్లో కొన్నేళ్లు ఈ రోడ్డుకు మరమ్మతులు చేయించారు. ఆ తరువాత నుంచి ఈ రోడ్డు గురించి పట్టించుకున్న నాథుడే లేరు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ రోడ్డుకు తక్షణమే మరమ్మతులు చేయడంతో పాటు, రోడ్డుకు ఇరు పక్కల, మూలమలుపుల వద్ద ఏపుగా పెరిగిన చెట్లును తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

అర్వపల్లి : అకాల వర్షాల దృష్ట్యా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా రైతులు తగు జాగ్రతలు తీసుకోవాలని తిమ్మాపురం క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి నేరెళ్ల సత్యం కోరారు. మండల పరిధిలోని కుంచమర్తి, తిమ్మాపురం, అడివెంల తదితర గ్రామాల్లో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలించారు. అకాల వర్షాలతో ధాన్యం తడిసిన రైతులు రాశులపై ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేస్తే ధాన్యం రంగు మారకుండా మొలకెత్త కుండా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకురాలు మన్నె సుజాత, రైతులు అలుగుబెల్లి సంజీవరెడ్డి, గుండగాని శ్రీను పాల్గొన్నారు.

### ఆర్థికసాయం అందజేత

అర్వపల్లి : మండల పరిధిలోని వేల్పుచెర్ల గ్రామానికి చెందిన ఖమ్మంపాటి సులోచన, సంపతి సుశీల అనారోగ్యానికి గురికావడంతో గ్రామ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందించారు. ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున రూ.10 వేలు ఆర్థికసాయంను మంగళవారం అందజేసినట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. సర్పంచ్ ఖమ్మంపాటి కరుణాకర్, ఉపసర్పంచ్ రాంబాబు, మార్కెట్ డైరెక్టర్ ఖమ్మంపాటి నరేష్, అశోక్, సంపతి కిరణ్, మధుసూదన్, సాంబయ్య, ప్రశాంత్, సైదులు, పాల్గొన్నారు.

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని కోడూరులో నిరుపేద కుటుంబానికి చెందిన చిలక బత్తిని సారంగం ఇటీవల మృతి చెందారు. అతడి కుటుంబానికి మంగళవారం ట్రాక్టర్ యూనియన్ ఆధ్వర్యంలో రూ.22 వేలు, మృతుడి 10వ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.11 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు.

## మంత్రి కేటీఆర్‌ను కలిసిన నాయకులు



మంత్రి కేటీఆర్‌తో ఎమ్మెల్యే సైదిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి

హుజూర్‌నగర్ : బీఆర్‌ఎస్ అసమ్మతి నేత జిన్నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, హుజూర్‌నగర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి ఇరువురు మంగళవారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి తాజా రాజకీయాలు, గెలుపు వ్యూహాలపై చర్చించినట్లు తెలిసింది.

## కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం



చిలుకూరు : కాంగ్రెస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు పద్మావతి, చందర్‌రావు



మునగాల : పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న పద్మావతి

చిలుకూరు : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యేలు పద్మావతి, వేనేపల్లి చందర్‌రావులు మంగళవారం ప్రారంభించారు. అనంతరం గ్రామానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు వివిధ పార్టీల నుంచి పద్మావతి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ బండ్ల ప్రశాంతి కోటయ్య, జెడ్పీటీసీ బొలిశెట్టి శిరీషానాగేంద్రబాబు, మండల పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కీత వెంకటేశ్వర్లు, పిండ్రాతి హనుమంతరావు, మాజీ ఎంపీపీ బజ్జూరి వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**హుస్సేన్‌బాద్ గ్రామంలో..**

మోతె : మండలంలోని హుస్సేన్‌బాద్ గ్రామంలో మంగళవారం కోదాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నలమాద పద్మావతి కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ ముప్పాని ఆశ, జెడ్పీటీసీ పందిళ్లపల్లి పుల్లారావు, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, సర్పంచ్‌లు యల్లయ్య, పద్మాఅంద్రారెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ గుర్వారెడ్డి, కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ ముదిరెడ్డి మధుసుదన్‌రెడ్డి, మాతృనాయక్, నూకల మధుసుదన్‌రెడ్డి, చిన వెంకటరెడ్డి, శ్రీనివాస్, జానకిరాములు, వీరారెడ్డి, ఉపసర్పంచ్ శోభగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

**పద్మావతి, వేనేపల్లి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు**

మునగాల : మండలంలోని ఆకుపాములలో మంగళవారం రాత్రి కోదాడ మాజీ ఎమ్మెల్యేలు ఎస్.పద్మావతి, వేనేపల్లి చందర్‌రావుల సమక్షంలో రెండు వందల మంది బీఆర్‌ఎస్‌ను వీడి సుంకి జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో వారికి పద్మావతి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు విలాసకవి రామరాజు, పోలంపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా వెంకటేశ్వర్లు, లిక్కి రామరాజు, విలాసకవి ప్రసాద్‌రాజు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ జిల్లేపల్లి గోపి, మండల పార్టీ నాయకులు నల్లపాటి శ్రీనివాస్, ఎలక నరేందర్ రెడ్డి, కొలిశెట్టి బుచ్చిపాపయ్య, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**కాంగ్రెస్‌లోకి ముదిరాజ్ కుటుంబాలు**

కోదాడరూరల్ : మండలంలోని రెడ్లకుంటకు చెందిన యాభై ముదిరాజ్ కుటుంబాలు గంగవరపు లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి పద్మావతిరెడ్డి సమక్షంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరాయి. పార్టీలో చేరిన వారిలో గుండె సత్యనారాయణ, వెన్నబోయిన ఆదినారాయణ, గుండె పుల్లయ్య, హనుమంతు, అంజి, కనకమ్మ, లక్ష్మీబాయి, సుజాత, శ్రీను తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి, మల్లెల ప్రసాద్, కనగాల నాగేశ్వరరావు, రేవూరి వెంకటాచారి తదితరులు ఉన్నారు.

**బాధిత కుటుంబానికి పరామర్శ**

మోతె : మండలంలోని కూడలిలో బానోతు జేతు దశదిన కర్మ కార్యక్రమానికి మంగళవారం కోదాడ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నలమాద పద్మావతి పాల్గొని జేతు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

**కూడలిలో 50 కుటుంబాలు చేరిక**

కూడలి గ్రామంలో మంగళవారం పద్మావతి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి 50 కుటుంబాల వారు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పద్మావతి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, జెడ్పీటీసీ పందిళ్లపల్లి పుల్లారావు, ఎంపీపీ ముప్పాని ఆశ, మధుసుదన్‌రెడ్డి, మైనంపాటి గుర్వారెడ్డి, చిన వెంకటరెడ్డి, రవిబాబు, రామాచారి, మధు, నవీన్, బాలకృష్ణ, గ్రామ శాఖ అధ్యక్షుడు భూక్య వీర, హరిప్రసాద్, కిషన్‌నాయక్, సంజీవ, పాల్గొన్నారు.

## ఘనంగా హనుమంతునికి ఆకుపూజ



ఆకుపూజ నిర్వహిస్తున్న మాలధారులు, భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో మంగళవారం శ్రీఆంజనేయస్వామికి భక్తులు ఆకుపూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, ఆరాధన, సేవాకాలం, అలంకరణ, పంచామృత అభిషేకం, ఆకుపూజ, మంగళాశాసనం, తదితర పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గండు సైదులు, కార్యనిర్వాహణాధికారి ఎంపి లక్ష్మణరావు, అర్చకుడు హరీష్‌కుమార్‌చార్యులు, యరగాని కిరణ్‌కుమార్‌గౌడ్, ఉపేందర్, రమేష్, భక్తులు పాల్గొన్నారు.

### విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలి

నూతనకల్ : హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ఈ నెల 11న నిర్వహించే మాదిగ విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పాల్వాయి పరశురాములు కోరారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించే విశ్వరూప మహాసభకు ప్రధాని నరేంద్రమోదీ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బత్తుల వెంకటనర్సు, నాగమల్లు, సురేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### సీపీఎం నాయకుడు మృతి

అర్వపల్లి : సీనియర్ నాయకుడు యాదగిరి మృతి పార్టీకి తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి అన్నారు. పర్సాయపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ బొడ్డు గంగయ్య కుమారుడు, సీనియర్ నాయకుడు యాదగిరి మృతి చెందడంతో అతడి మృతదేహాన్ని మంగళవారం సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు చెరుకు యాకలక్ష్మి, మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్, జీఎంపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి వజ్జె వినయ్‌యాదవ్, శిగ వెంకన్న, ఎస్.అబ్బులు, బొడ్డు సైదులు, అరిగె వీరస్వామి, కె.భిక్షం, భిక్షపతి పాల్గొన్నారు.

# అధ్వానంగా లింక్, అంతర్గత రహదారులు

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



శ్రీరంగాపురం నుంచి సిరిపురంనకు వెళ్లే రహదారి



వేణుగోపాలపురం- వీరాంజనేయనగర్‌కు వెళ్లే రోడ్డు ఇలా..

నడిగూడెం : పేరు గొప్ప, ఊరు దిబ్బ అన్న చందంగా మారింది నడిగూడెం మండలం పరిస్థితి. అభివృద్ధి చెందుతుందని పేరున్నా ప్రజలు మాత్రం పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా మండలంలో అంతర్గత రహదారులు, లింకు రోడ్లు సరిగ్గా లేకపోవడంతో పాటు చాలా ఏళ్ల క్రితం వేసిన రహదారులు దెబ్బతినడంతో ప్రజలు రాకపోకలకు నానా ఇబ్బందులు పడుతున్నారు. అయినా రోడ్లు, భవనాల శాఖ, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం పట్టించుకోవడం లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా మండలంలోని శ్రీరంగాపురం నుంచి సిరిపురంనకు, వల్లాపురం నుంచి శ్రీరంగాపురంనకు వెళ్లే రహదారి, కరివిరాల నుంచి వేణుగోపాలపురంనకు వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతిన్నాయి. అదే విధంగా నడిగూడెం నుంచి మునగాల మండలం నారాయణగూడెంకు వెళ్లే రహదారి గుంతలమయం, కంపచెట్లమయంగా మారింది. అలాగే వల్లాపురం నుంచి చనుపల్లి గ్రామానికి వెళ్లే రహదారి కంకర తేలి, అనేక చోట్ల దెబ్బతిన్నది. దీంతో రహదారులు చినుకుపడితే చిత్తడిగా మారుతున్నాయి. లోతైన గుంతలు ఏర్పడడంతో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

**కంకర పరిచారు.. వదిలేశారు**

కాగా, రత్నవరం గ్రామం నుంచి తెల్లబల్లి, మునగాల మండలం కోదండరామాపురం మీదుగా ఆకుపాముల వరకు బీటీ వేసేందుకు నాలుగు నెలల క్రితం కంకర పరిచారు. కానీ నేటికీ రహదారి వేయలేదు. అలాగే నారాయణపురం క్రాస్ రోడ్డు నుంచి నారాయణపురం గ్రామంలోకి దాదాపు రెండు కిలోమీటర్ల దూరం వరకు బీటీ రహదారి వేసేందుకు మెటల్ వేసి రహదారి ఏర్పాటు చేశారు. కానీ రెండు సంవత్సరాలైనా నేటికీ బీటీ రహదారి వేయలేదు. దీంతో ఆ గ్రామానికి, ఆ గ్రామం మీదుగా సిరిపురం, వల్లాపురం ఇతర గ్రామాలకు వెళ్లే ప్రజలు, వాహనదారులు కూడా నానా తిప్పలు పడుతున్నారు.

**ప్రమాదకరంగా కల్వర్టులు**

రత్నవరం సమీపాన ఉన్న కల్వర్టు, వల్లాపురం వద్ద ఉన్న కల్వర్టు పూర్తిగా దెబ్బతిన్నాయి. కల్వర్టులు దెబ్బతినడంతో రాత్రి సమయాల్లో ఆ కల్వర్టుల వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. లోతైన గుంతలు ఏర్పడడంతో కొత్తగా వచ్చే ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రత్నవరం వద్ద శిథిలావస్థలో ఉన్న కల్వర్టు నిర్మాణ పనులకు నిధులు మంజూరైనా పనులు మాత్రం ఇంకా చేపట్టడంలేదు.

### రాకపోకలకు ఇబ్బందులు



సిరిపురం గ్రామం నుంచి శ్రీరంగాపురం వరకు నడిచి వెళ్తున్నాం. పలుచోట్ల రహదారి పూర్తిగా దెబ్బతిన్నది. అలాగే రహదారిపై లోతైన గుంతలతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. రహదారికి ఇరువైపులా కంపచెట్లు ఉన్నాయి. దీంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి.

– బొడ్డుపల్లి కృష్ణయ్య, శ్రీరంగాపురం

### బీటీ రోడ్డు నిర్మించాలి



వేణుగోపాలపురం నుంచి వీరాంజనేయనగర్‌కు వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. పొలాల నుంచి వచ్చే నీరు, పైపులైన్‌ల లీకేజీ నీరు రోడ్డుపై చేరుతుండటంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. వేణుగోపాలపురం- కరివిరాల రహదారి కూడా అధ్వానంగా ఉంది. అధికారులు స్పందించి బీటీ రహదారి నిర్మించాలి.

– లావూరి శంకర్‌నాయక్, వేణుగోపాలపురం